ఎమ్మెల్యే గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీని ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ కోరారు. శుక్రవారం డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని జన్మభూమి కాలనీ, శివమ్మ కాలనీ, కమలమ్మ కాలనీ, మహావీర్‌నగర్, దత్తాత్రేయ కాలనీ, మహాత్మాగాంధీనగర్, ఖాజానగర్ వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్‌కి చెందిన బీజేపీ యువకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీశేఖర్, కుమార్, స్వామి, మహేష్‌ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు శుక్రవారం గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హైదర్‌నగర్ డివిజన్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఖాళీ అయ్యిందన్నారు. రానున్న ఎన్నికల్లో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీలో చేరిన వారిలో శివ, కరుణాకర్, సాయికిషోర్, నర్సింహ, యుగేందర్, మహేందర్, కిరణ్, భువనేశ్వర్, పూర్ణ సాయి, అరుణ్, అజయ్, విజయ్ తదితరులు ఉన్నారు.

శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్‌గా బోయిడి నాగేంద్రబాబు

ఆల్విన్‌కాలనీ: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి బోయిడి నాగేంద్ర బాబును శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ఇన్‌చార్జి అక్షయ లక్రా, అధ్యక్షులు డాక్టర్ వెంకట్ నర్సింగ్‌రావుల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవిని ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కృష్ణారావుకు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలి

కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు ఓటు వేసి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నుంచి అత్యధిక మెజార్టీ అందించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో డివిజన్‌లో 90శాతం అభివృద్ధి చేసుకున్నామన్నారు. అదే విధంగా పలు సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందజేశామన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే కృష్ణారావుకు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌నాయకులు నరేందర్ గౌడ్, మక్కల నర్సింగ్‌రావు, సయ్యద్ ఏజాజ్, బాలరాజు, ఇర్ఫాన్, మేకల హరినాథ్, లలిత, ఉమా, సరోజా దేవి కనకరాజు, మక్కల సత్యనారాయణ, పోచయ్య, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో అనేక సమస్యలను పరిష్కరించాం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా తనకు మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. శుక్రవారం ఆయన శేషాద్రినగర్ వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పదేళ్ల క్రితం కరెంటు కష్టాలు విపరీతంగా ఉండేవని ఇప్పుడు ఆ కష్టాలు లేవన్నారు. ఐదు లక్షల గ్యాలన్ల సామర్థ్యం ఉన్న వాటర్ రిజర్వాయర్ కట్టి ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చామన్నారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న కూకట్‌పల్లి రామాలయాన్ని పునరుద్ధరించి అద్భుతంగా కట్టామన్నారు. ఐడీఎల్ చెరువును సుందరీకరించామని తెలిపారు. కూకట్‌పల్లిలో పోలీస్‌స్టేషన్, గ్రామం పేరుతో మండల కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. తనను కలవాలంటే ఎప్పుడు అందుబాటులో ఉంటానని.. తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

విధిగా ఓటు వేయాలి

శేరిలింగంపల్లి సహాయ రిటర్నింగ్ అధికారి సుస్మిత

రాయదుర్గం: తాము ఓటు వేస్తూ ఇతరులు కూడా ఓటేసేలా చూడాలని శేరిలింగంపల్లి సహాయ రిటర్నింగ్ అధికారి సుస్మిత సూచించారు. రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీలో శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులు ఓటింగ్ ప్రాముఖ్యత, వినియోగంపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు పౌరులందరికీ ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. తాము ఓటు వేస్తామని, తమ తోటివారు, ఇంట్లోని, పరిసరాల్లోని వారంతా ఓటు వేసేలా చూస్తామని ప్రతిజ్ఞ చేయించారు. జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ ఎస్ ఇక్బాల్‌హుస్సేన్, అధ్యాపకురాలు అరుణకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నోడల్ అధికారులు ఉషారాణి, మల్లేశ్వరి, ఇతర జీహెచ్ఎంసీ అధికారులు, ఉద్యోగులు, జీఐఎల్‌టీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే ముదిరాజ్ కులస్తుల మద్దతు

ముదిరాజ్ విద్యావంతుల వేదిక

పంజగుట్ట: ఒక కులం అభివృద్ధి చెందాలంటే రాజకీయ ప్రాతినిధ్యం ఒక్కటే సరిపోదని, అభివృద్ధి, సంక్షేమం ఎంతో ముఖ్యమని తెలంగాణ వచ్చిన 10 సంవత్సరాల్లో ముదిరాజ్ కులస్తుల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ విద్యావంతుల వేదిక చైర్మన్ ప్రొఫెసర్ సి.హెచ్.దినేష్ కుమార్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్ విద్యావంతుల వేదిక బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి అల్లుడు జగన్ ముదిరాజ్‌లతో కలిసి మాట్లాడారు. ఎల్లవేళలా బీఆర్ఎస్ ముదిరాజ్‌లకు అండగానే ఉందన్నారు.

లోకాయుక్త పటిష్టంతో అవినీతి మాయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో లోకాయుక్తను పటిష్టం చేయడంతో పాటు పూర్తి అధికారాలను బదలాయిస్తే అవినీతిని సమూలంగా రూపుమాపే అవకాశం ఉంటుందని రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో పౌర కేంద్రీకృత పాలన పారదర్శకత-అవశ్యకత-సవాళ్లు, సంస్కరణలు అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సుకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లోకాయుక్త పటిష్టంగా ఉంటేనే అవినీతి తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జస్టిస్ కళార్చనబోగి మాట్లాడుతూ కరోనా సమయంలో న్యాయవ్యవస్థలో తీసుకొచ్చిన ఈ-జస్టిస్ విధానం బాగుందన్నారు. సహచట్టం కమిషన్ పూర్వ సభ్యుడు విద్యాధర్‌భట్, లా కళాశాల ప్రిన్సిపల్ సృజన పాల్గొన్నారు.

ఓయూ-జేఎన్‌టీయూహెచ్ ఒప్పందం

లాలాపేట: ప్రీ-ఇంక్యుబేషన్, ఇంక్యుబేషన్, యాక్సిలరేషన్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేసిన ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేటర్(ఓటీబీఐ), జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలు (జెఎన్‌టీయూహెచ్) పరస్పర అవగాహన ఒప్పందం చేసుకున్నారు. శుక్రవారం ఓయూలో జరిగిన సమావేశంలో ఓటీబీఐ సీఈఓ డాక్టర్ ఆర్ హఫీజ్ బాషా, జేటీబీఐ ప్రోగ్రాం మేనేజర్ స్వాతి ఆనందం సమక్షంలో ప్రొ.ఇ. విద్యాసాగర్, ప్రొఫెసర్ ఎం. ఆశారాణి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మేరకు దరఖాస్తు ఫారాలను సమష్టిగా పంపిణీ చేయడం, సమర్పించిన ప్రతిపాదనలను మూల్యాంకనం చేయడానికి ఓటీబీఐ, జేటీబీఐలు కలిసి స్క్రీనింగ్ కమిటీని రూపొందించడానికి కలిసి పని చేస్తాయని యూనివర్సిటీ అధికారులు పేర్కొన్నారు. ఈ రెండు యూనివర్సిటీల టీబీఐలు ఎంచుకున్న స్టార్టప్‌లకు మార్గ దర్శకత్వం, నెట్‌వర్కింగ్, నిధుల అవకాశాలను అందిస్తాయన్నారు. ఈ భాగస్వామ్యంతో రెండు యూనివర్సిటీల నుంచి ఆవిష్కర్తలు, విద్యార్థులకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు.

కూకట్‌పల్లి డివిజన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, భారీగా హాజరైన ప్రజలు



నియోజకవర్గాన్ని రూ.9వేల కోట్లతో అభివృద్ధి చేసుకున్నాం

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ప్రజలకు క్రమంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- పలు కాలనీల అసోసియేషన్లతో ఆత్మీయ సమ్మేళనం



ఆర్ఎంపీ డాక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్‌లోని మైత్రినగర్, ఏవీబీ పురం, దయార్‌గూడ ప్రాంత కాలనీల అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహాయ సహకారాలతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని దాదాపు 9 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. సొంత గ్రామమైన కూకట్‌పల్లిలో ఈనాడు చరిత్రాత్మకమైన దేవాలయాలు, మసీదులు, చర్చిలు వంటివి కులమతాలకు అతీతంగా వాటి ప్రాసస్త్యాన్ని కాపాడుతున్నామన్నారు. మంచినీటి కొరత లేకుండా రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలకు లోటు లేకుండా చేశామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు.

శాంతి భద్రతలో ముందు వరుసలో తెలంగాణ..

◆ ఎన్నో ఏళ్లుగా పాలించిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. కేవలం కులాలు, మతాలు అడ్డు పెట్టుకొని నేడు స్థానికంగా ఉండే నాయకులకు కాకుండా ఎక్కడెక్కడి నుంచో నాయకులను దింపి పోటీకి పెడుతున్నాయని అన్నారు. ప్రజలు దీనిని గమనించాలన్నారు. మళ్లీ అభివృద్ధికే పట్టం కట్టాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తేనే తెలంగాణ రాష్ట్రం ముందుకెళ్తుందన్నారు. పదేళ్ల కాలంలో శాంతి భద్రతల విషయంలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. దీనిని కాపాడుకోవాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు.

ఆర్ఎంపీ డాక్టర్లతో సమావేశం...

కూకట్‌పల్లి ఆర్ఎంపీ డాక్టర్ల అసోసియేషన్ డాక్టర్ దత్తరావు ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు.



సమావేశం అనంతరం ఆర్ఎంపీ డాక్టర్లతో ఎమ్మెల్యే కృష్ణారావు

బీఆర్ఎస్‌లో చేరికలు

కూకట్‌పల్లి: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్, జనప్రియనగర్‌కు చెందిన పలువురు బీజేపీ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్ సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద సంఖ్యలో నాయకులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరామన్నారు. తిరిగి మూడోసారి ఎమ్మెల్యేగా కృష్ణారావు హ్యాట్రిక్ సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లింగతాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, జాహెద్ షరీఫ్ బాబా, రాజు రజక, గంగపుత్ర శంకర్, శ్రీనివాస్‌యాదవ్, నితిన్, బ్రహ్మం, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో అల్లాపూర్ డివిజన్ బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

కాంగ్రెస్‌ను మైనార్టీలు ఓటుతో ఆశీర్వదించాలి



అల్లాపూర్‌లో మైనార్టీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మహారాష్ట్ర రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్ ఘరి, బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్

కూకట్‌పల్లి: మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి కట్టుబడి ఉందని మహారాష్ట్ర రాజ్యసభ సభ్యుడు, కవి ఇమ్రాన్ ప్రతాప్ ఘరి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్‌కు మద్దతుగా అల్లాపూర్ డివిజన్‌లో 5వేల మంది మైనార్టీలతో నిర్వహించిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి మైనార్టీలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రూ.4వేల కోట్ల బడ్జెట్‌తో మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించిందన్నారు. అనంతరం గానంతో అందరినీ ఆకట్టుకున్నారు.

బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లే..

◆ కాంగ్రెస్ పార్టీని మైనార్టీలు తమ ఓటుతో ఆశీర్వదించాల్సి అవసరం ఉందన్నారు. అనంతరం అభ్యర్థి బండి రమేష్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం పనిచేసే పార్టీ దేశంలో ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీనే అన్నారు. బీఆర్‌యస్, బీజేపీ పార్టీకి బీ టీం అన్నారు. ఎమ్మెల్సీ కవితను లిక్కర్ కేసులో ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే అది బీజేపీ ఖాతాలో పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎన్నికల ఇన్‌చార్జి సత్యం శ్రీరంగం, మైనార్టీ నాయకుడు ఎండీ మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్ బోయినపల్లి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్

కూకట్‌పల్లిలో కాంగ్రెస్ గెలుపు ఖాయం: బండి రమేష్

ఓల్డ్‌బోయినపల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి బండి రమేష్ శుక్రవారం ఓల్డ్ బోయినపల్లి డివిజన్‌లోని అబ్రహం నగర్, ఫాతిమా మసీద్, సిండికెట్‌బ్యాంకు కాలనీ, వైష్ణవి దేవి కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ప్రచారంలో అనేక సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కోఆర్డినేటర్ సత్యం శ్రీరంగం, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, దండుగుల యాదగిరి, మల్లికార్జున్ యాదవ్, యూత్ ప్రెసిడెంట్ కిరణ్‌గౌడ్, శ్రీరాములు, శ్రీను, విజయలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి శోభ

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ 3వ ఫేజ్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగతిని జాగృతం చేసే చైతన్య దివ్య దీప్తుల పండగే దీపావళి అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా.. విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఏటా ఆశ్వయుజ అమావస్య రోజున జరుపుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రమితలలో దీపాలు వెలిగించి బాణసంచా కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌంట్ లిటేర కిడ్జీ స్కూల్‌లో...

మూసాపేట: మూసాపేటలోని మౌంట్ లిటేర కిడ్జి స్కూల్‌లో శుక్రవారం దీపావళి పండుగ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాణసంచా కాల్చి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ... విద్యార్థులకు పండుగల విశిష్టతను తెలిపేందుకు పండుగ వేడుకలు నిర్వహించామన్నారు.



రవీంద్రభారతి పాఠశాలలో దీపావళి వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



కిడ్జీ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా హోమ్ టు డే ఫర్నిచర్ వార్షికోత్సవం



వార్షిక వేడుకల్లో పాల్గొన్న నిర్వాహకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ది చెన్నై సిల్క్ ఆవరణలో హోమ్ టుడే ఫర్నిచర్ 5వ వార్షికోత్సవం సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వార్షికోత్సవ, దంతేరాస్, దీపావళి పండుగలను పురస్కరించుకొని ప్రతి కొనుగోలుపై 30 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీపావళికి సరికొత్త డిజైన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఆర్. రమేష్, మేనేజర్‌లు త్యాగరాజన్, వినయ్‌కుమార్, స్మార్ట్ విక్రం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, పరిశోధకులు దేశాభివృద్ధికి కృషి చేయాలి

కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్

రాయదుర్గం: విద్యార్థులు, పరిశోధకులు దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూలో ఆజాద్ స్మారక ఉపన్యాస కార్యక్రమంను శుక్రవారం నిర్వహించారు.వీసీ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మౌలానా ఆజాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని అభివర్ణించారు. ఎన్ఈపి-2020 శక్తివంతమైన యువతరానికి శిక్షణ ఇవ్వడమే ప్రధాని యొక్క కొత్త విద్యావిధానమని ఆయన అన్నారు.ఈ విద్యా విధానం కింద భారతీయ భాషలను ప్రోత్సహించడం అనేది కేంద్రం యొక్క ప్రధాన ప్రాధాన్యత అన్నారు. అనంతరం కేంద్ర మంత్రిని వీసీ సత్కరించి మొమెంటోను అందించారు. అనంతరం న్యూఢిల్లీలోని బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సలీల్‌మిశ్రా ప్రసంగించారు.



భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు



భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


కూకట్‌పల్లి: భారత వికాస్ పరిషత్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి 44పాఠశాలల నుంచి 79బృందాలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఇందుశేఖర్ హాజరై విద్యార్థులకు దేశభక్తి, జాతీయ భావాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాఖ అధ్యక్షుడు సీహెచ్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పంచశీల శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో జరిగింది. దీనికి సీహెచ్ హనుమంతరావు, సాధన నర్సింహాచారి, శివరాత్రి యాదగిరి, బీఎస్ఎస్ మూర్తి పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ పోటీల్లో ఆర్ఆర్ విద్యాభవన్ హైస్కూలు, మోడల్‌స్కూల్ విద్యార్థులు సీనియర్, జూనియర్ విభాగాల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

- బీజేపీ నేత మాధవరం కాంతారావు
- పార్టీ అధినాయకత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఉమ్మడి బీజేపీ-జనసేన పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ శుక్రవారం బీజేపీ సెంట్రల్ అబ్జర్వర్, మాజీ మంత్రి కె. సుధాకర్‌తో కలిసి కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కూకట్‌పల్లి అసెంబ్లీలో చేపట్టాల్సిన ప్రచార షెడ్యూల్, పోలింగ్ బూత్ కేంద్రాల వివరాలు, ఓటర్ రీవెరిఫికేషన్ ప్రక్రియకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

◆ ఈ సందర్భంగా మాధవరం కాంతారావు మాట్లాడుతూ... కూకట్‌పల్లి ప్రాంతానికి సంబంధించిన టికెట్ విషయంలో క్రమశిక్షణ కలిగిన ఓ బీజేపీ కార్యకర్తగా బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని అన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రానున్నది బీజేపీ పార్టీ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుతం ఎమ్మెల్యే పనితీరును ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయటం అందుకు నిదర్శనమన్నారు. సొంత పార్టీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని విమర్శించారు.



కాంతారావును కలిసిన మాజీ మంత్రి సుధాకర్, ముమ్మారెడ్డి ప్రేమకుమార్

◆ ప్రశ్నించే వారిపై అక్రమ కేసులను పెడుతూ నియంతృత్వ పాలన నుంచి విముక్తి పొందేందుకు బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈనెల 30వ తేదీన గాజు గ్లాస్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, షేక్ షాజహాన్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, జనసేన కార్యకర్తల సమావేశం

కూకట్‌పల్లి: మిత్ర ధర్మాన్ని పాటిస్తూ జనసేన పార్టీ గాజుగ్లాస్ గుర్తును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు కోరారు. బోయిన్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో ఎన్నికల ప్రచారం కార్యక్రమాలపై బీజేపీ-జనసేన కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ... బీజేపీ-జనసేన పొత్తులో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గ టికెట్‌ను జనసేనకు కేటాయించారన్నారు. బీజేపీ శ్రేణులు అందరూ కష్టపడి శక్తి వంచన లేకుండా జనసేన విజయానికి కృషి చేయాలని కోరారు. బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎన్డీఏ భాగస్వామి అయిన జనసేనతో కలిసిమెలిసి పనిచేయాలని కోరారు. ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించటానికి కృషి చేయాలని కోరారు.



బీజేపీ, జనసేన నాయకులసమావేశంలో మాట్లాడుతున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

అఖండ మెజార్టీతో గెలిపించాలి

అపార్ట్‌మెంట్ల వాసులతో ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని ఈనాడుకాలనీ, ఏఎస్‌రాజు నగర్, సప్తగిరి కాలనీ, మెడికల్ సొసైటీ, వీవీనగర్ అపార్టుమెంట్ వాసులతో శనివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బంగారు తెలంగాణ కోసం ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు సంజీవరెడ్డి, గొట్టిముక్కల పెద్ద భాస్కర్, నాయినేని చంద్రకాంత్ రావు, ఎర్రబెల్లి సతీష్, పురేందర్ రెడ్డి, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిన తమిళనాడు వాసులు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు అభివృద్ధి పథకాలను చూసి ప్రజలు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరుతున్నారని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్‌లోని హైదర్‌నగర్ గ్రామంలో 65 ఏళ్లుగా ఉంటున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన 50 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసారావు, ప్రమోద్‌గౌడ్, కె. మురుగన్, కె. శేఖర్, ఎం. ధనశేఖర్, కృష్ణ, కుమార్, శివకుమార్, మణికంఠ, రాజు, జానీ, వెంకటేష్, మొగులయ్య, సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో గులాబీ జెండా ఎగరేస్తాం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ ఫేజ్–2లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ గెలుపు కోసం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పేదలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి విజయాన్ని చేకూర్చుతాయన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

అరెకపూడి గాంధీకి హ్యాట్రిక్‌ను అందిద్దాం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని ఛత్రపతి శివాజీనగర్, మహంకాళి నగర్, ఆశానగర్, శంషీగూడ, ఇంద్రాహిల్స్, సాయిచరణ్ కాలనీల్లో ఇంటింటికి వెళ్లి కాలనీ వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరెకపూడి గాంధీకి ఓటు వేసి హ్యాట్రిక్ విజయాన్ని అందజేయాలని కోరారు.

నిరుద్యోగులూ ఆలోచించి ఓటు వేయండి

పంజగుట్ట: తెలంగాణ రాగానే ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ ఉచిత విద్య అని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఒకతరం నిరుద్యోగులను మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. యువత మరోమారు మోసపోకుండా ఆలోచించి ఓటు వేయాలని ఆయన సూచించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ విద్యావంతుల సంక్షేమ సంఘం ఆవిర్భావ సభ నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రంగసాయి భట్టు, వినోద్‌రావులతో కలిసి వీహెచ్ మాట్లాడుతూ... రాష్ట్రం వచ్చిన ఎనిమిదిన్నర సంవత్సరాల తర్వాత 15 నోటిఫికేషన్లు వేసి నిరుద్యోగుల నుంచి రూ. 220 కోట్లు దండుకుని పేపర్ లీకేజీలు, కోర్టు కేసులు వేసి ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం టీఎస్‌పీఎస్సీలో దరఖాస్తు చేసుకున్న వారే 45 లక్షల మంది ఉన్నారని ఇతర బోర్డుల్లో ఎంతో మంది దరఖాస్తులు చేసుకున్నారని వారు ఇప్పటికైనా ఆలోచించి ఓటు వేయాలని సూచించారు.

విధులను బాధ్యతతో నిర్వర్తించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చేపట్టిన చర్యలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అబ్జర్వర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో మేడ్చల్, రంగారెడ్డి, జిల్లాల ఎన్నికల సాధారణ పరిశీలకులు, పోలీస్ జనరల్ అబ్జర్వర్లు, రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలికేరి, రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించి తుది ఓటర్ల జాబితాను వెల్లడించారు.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం ఓటర్లు 28,19,067 కాగా, వారిలో పురుషులు14,59,629. స్త్రీలు 13,59,057, థర్డ్ జెండర్ 381 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 438 లొకేషన్స్‌లో 2,397 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వీటిలో అర్బన్ పోలింగ్ స్టేషన్లు 2,239 ఉన్నాయని పేర్కొన్నారు. రూరల్‌లో 158 పోలింగ్‌స్టేషన్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా ఐడిఓసిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అధునాతన పీటీజెడ్ కెమెరాలను ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు.
- అభ్యర్థులు, పార్టీల ఎన్నికల వ్యయాన్ని లెక్కించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి అన్ని విధాలుగా పరిశీలన జరుపుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.
- సరిహద్దు ప్రాంతాల్లో 14 చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేసి నియోజకవర్గ కేంద్రాలకు తరలించి స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చామని, పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, రిటర్నింగ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సెమీస్‌లో నర్సింహారెడ్డి జోడీ

లక్డీకాపూల్: హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం (హెచ్ఓటీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 15వ జాతీయ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో నంద్యాల నర్సింహారెడ్డి, నీల్‌కాంత్ జోడీ జోరు కొనసాగుతోంది. పురుషుల 50 ప్లస్ డబుల్స్ విభాగంలో నంద్యాల, నీల్‌కాంత్‌లు అలవోకగా సెమీఫైనల్లో అడుగుపెట్టారు. శనివారం సికింద్రాబాద్ క్లబ్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్లో శ్రీధర్, బాలరాజు జోడీపై 8–5తో గెలుపొందిన నర్సింహారెడ్డి, నీల్‌కాంత్‌లు టైటిల్‌కు మరింత చేరువయ్యారు. చంద్రశేఖర్ రెడ్డి, ఎల్. శ్రీధర్ సైతం 8–3తో శ్రీనివాస్, వెంకట్‌పై గెలుపొంది సెమీస్‌లో అడుగుపెట్టారు. మెన్స్ సింగిల్స్ విభాగంలో ఈశ్వర్ సాయి 8–4తో విశాల్‌పై, కన్నన్ 8–0తో హనుమాన్ రాముపై గెలుపొంది 30 ప్లస్ విభాగంలో సెమీస్‌కు చేరారు. 40 ప్లస్ సింగిల్స్‌లో అఫ్రోజ్ 8–1తో రవిని, నర్సింహులు 8–1తో వి. ప్రకాశ్‌ను ఓడించి సెమీస్‌లో ప్రవేశించారు. 50 ప్లస్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో చంద్రశేఖర్ రెడ్డి 8–5తో సుధాకర్‌పై, నీల్‌కాంత్ 8–0తో జి. శ్రీనివాస్‌పై, వెంకట మూర్తి 8–4తో శివ రామరాజుపై విజయం సాధించారు. 60 ప్లస్ సింగిల్స్‌లో మెహర్ ప్రకాశ్ 8–3తో అర్జున్‌ను.. రామి రెడ్డి 8–3తో కె.పి రావును ఓడించగా, 70 ప్లస్ సింగిల్స్‌లో అంకయ్య 9–3తో రాజరత్నను, వి. గజపతి 9–2తో రాజగోపాలన్‌పై విజయం సాధించి సెమీస్‌కి చేరుకున్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని సోని కాంప్లెక్స్ రెండో అంతస్తులో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఎస్. సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలకు మగ్గం వర్కు, బ్లౌజ్ డిజైన్, టైలరింగ్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు కార్యాలయంలో లేదా ఫోన్ నం.93961 61936లో సంప్రదించాలన్నారు. తరగతులు 14 తేదీన ప్రారంభమవుతాయని తెలిపారు. బ్యాచ్‌కి 10 సీట్లు మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లు అందిస్తామని తెలిపారు.

విద్యుత్ శాఖ కార్యాలయంలో లక్ష్మి పూజలు



మోతీనగర్: దీపావళి పండుగ సందర్భంగా మూసాపేట డివిజన్ మోతీనగర్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో లక్ష్మి పూజను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈ మాధవి, గ్రీన్‌లాండ్ డీఈ ఆనంద్, ఏడీ అమర్‌నాథ్, జీవో శ్రీనివాస్, ఏజేఓ రమణ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో దీపావళి వేడుకలు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో శనివారం దీపావళి పండుగ వేడుకలు నిర్వహించారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేసి, దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాణసంచా కాలుస్తూ దీపావళి పండుగ శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యం అందుబాటులో ఉండే ఎమ్మెల్యే కృష్ణారావునే గెలిపించుకుందాం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గెలుపే లక్ష్యంగా మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు నారాయణ రాజు, మాజీ కౌన్సిలర్ ధనలక్ష్మి, అసోసియేషన్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు 6వ ఫేజులో ప్రతి ఇంటికి తిరుగుతూ ఇంటింటి ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో కేపీహెచ్‌బీ డివిజన్ ఏ విధంగా అభివృద్ధి చెందిందో వివరించారు. తెలంగాణ రాష్ట్రం అవతరించిన తరువాత కేసీఆర్ నాయకత్వంలో ఈ పదేళ్ల కాలంలో అందరం చాలా ప్రశాంతంగా జీవిస్తున్నామని ఎవరికీ ఎటువంటి ఆపద వచ్చిన నిత్యం అందుబాటులో ఉంటే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును తిరిగి గెలిపించుకోవాలన్నారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును గెలిపించాలి

కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కారు గుర్తుకు ఓటు వేసి కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావును అఖండ మెజార్టీతో గెలిపించాలని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కోరారు. శనివారం కూకట్‌పల్లి గ్రామంలోని శేషసాయి అపార్టుమెంట్ వాసులతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్ పార్టీకి షాక్

బీఆర్ఎస్‌లోకి గుర్రం రాజ్యలక్ష్మి



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రాజ్యలక్ష్మి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ వినాయక్‌నగర్‌లో నివాసం ఉండే కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం రాజ్యలక్ష్మి శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధి పట్ల ఆకర్షితురాలై బీఆర్ఎస్‌లో చేరానన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి మంత్రి కేటీఆర్, తెలంగాణ రాష్ట్ర అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రమిస్తున్నారని పేర్కొన్నారు.

కూకట్‌పల్లిలో మార్పునకు నాంది పలకండి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ ఫేజ్ 1లోని ధర్మారెడ్డి కాలనీ, జేఎన్‌టీయూ శ్రీ సీతారామంజనేయ స్వామి దేవాలయం నుంచి జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ, జనసేన పార్టీలు తెలంగాణ రాష్ట్రంలో కలిసి పనిచేయటం శుభపరిణామమని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలు గెలిపిస్తే గొప్ప మార్పు చూస్తారన్నారు. నిత్యం నియోజకవర్గంలో ఉంటూ స్థానిక సమస్యలపై పోరాటం చేస్తున్నానని తెలిపారు. గాజుగ్లాసు గుర్తుకు ఓటు వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

రవికుమార్ యాదవ్‌ను గెలిపించాలి

భాగ్యనగర్‌కాలనీ: రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి రవికుమార్ యాదవ్‌కు అఖండ మెజార్టీతో గెలిపించాలని మాజీ శాసనసభ్యుడు ఎం. భిక్షపతి యాదవ్ కోరారు. శనివారం ఆయన హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్, శ్రీనివాసకాలనీ అసోసియేషన్ సభ్యులను కలిసి రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయ్యాలని కోరారు.



అంజయ్యనగర్‌లో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాయకులు



అంజయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దరఖాస్తు చేసుకున్న వారందరికీ 'డబుల్' ఇళ్లు వస్తాయి

- కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు
- అంజయ్యనగర్‌లో ఫంక్షన్‌హాల్స్, పార్కులను నిర్మిస్తాం
- హిందూ, ముస్లిం, క్రైస్తవులకు వేర్వేరుగా నిర్మించి ఇస్తాం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఎన్నికలు వస్తాయి పోతాయి కానీ మీరు ఎవరిని గెలిపిస్తున్నారు.. ఎవరు మీ కోసం పని చేస్తారు.. మీ సంక్షేమానికి పాటు పడుతుంది ఎవరు? అనేది ఆలోచన చేసి ఓటు వేయాలని కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు ప్రజలను కోరారు. శనివారం అంజయ్యనగర్‌లో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 9 ఏళ్లుగా ఎమ్మెల్యేగా నిరంతరం ప్రజలకు సేవ చేస్తూ వచ్చామని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్నీ డివిజన్లను అభివృద్ధిలో ముందుంచామని పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అంజయ్యనగర్‌లో ఫంక్షన్‌హాల్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనేది తాను గుర్తించానన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం కేసీఆర్‌తో మాట్లాడి హిందూ, ముస్లిం, క్రైస్తవులకు ఫంక్షన్‌హాల్స్‌తో పాటు పార్కు నిర్మాణానికి కృషి చేస్తాన్నారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.
- **ప్రైవేట్ పాఠశాలల టీచర్ల మద్దతు...**

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఏర్పాటు చేసిన ప్రైవేట్ పాఠశాలల టీచర్ల సమావేశంలో బాలానగర్ మండల ప్రైవేట్ పాఠశాలల సంఘం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు మద్దతు ప్రకటించింది. ప్రతి ప్రైవేట్ టీచర్ కారు గుర్తుకే ఓటు వేయాలని ప్రతిజ్ఞ చేశారు.

- **బీఆర్ఎస్‌లోకి 400మంది మహిళలు**

కాంగ్రెస్ నాయకురాలు కవిత ఆధ్వర్యంలో సుమారు 400మంది మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నివాసంలో మైనార్టీ యువత బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, సయ్యద్ ఏజాజ్, బల్వంత్‌రెడ్డి, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి, వేణుగోపాల్‌రెడ్డి, కనకరాజు యాదవ్, రాజేశ్వరీ, వాసు యాదవ్, ఐలేష్, మల్లేష్, పోచయ్య, మక్కాల సత్యనారాయణ, ఖాదీర్, ఫీరోజ్, శ్రీనివాస్‌రెడ్డి మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

రంగధాముని చెరువును అత్యద్భుతంగా తీర్చిదిద్దాం

కాలనీ అసోసియేషన్ల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావుతో కలిసి బాలాజీనగర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆంజనేయనగర్, బాలాజీనగర్, కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 1, 3లలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఒకప్పుడు బాలాజీనగర్ డివిజన్‌లో మంచినీటి కొరతతో చాలా ఇబ్బంది పడేవారని ప్రస్తుతం 24 గంటలు విద్యుత్, మంచినీరు, సీసీ రోడ్లు వంటి మౌలిక సదుపాయాలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో చేసి చూపించామన్నారు. బాలాజీనగర్‌లో ఇంకా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

– అదే విధంగా చెరువుల సుందరీకరణతో ఇప్పటికే రంగధాముని చెరువుని అత్యద్భుతంగా తీర్చిదిద్దుకున్నామని మిగిలిన చెరువులను కూడా సుందరీకరించుకుని ఎస్‌టిపి ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేసుకొని కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శంగా మార్చబోతున్నామన్నారు. ఇంత అత్యద్భుతమైన ప్రణాళికలు ఉండబట్టే నేడు తెలంగాణ రాష్ట్రం ఇంత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇటువంటి ముందుచూపు ఉన్న వ్యక్తే మళ్లీ సీఎంగా కొనసాగాలని అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అఖండ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. తాను పోటీ చేస్తున్న కూకట్‌పల్లి నియోజకవర్గంలో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





బాలాజీనగర్ డివిజన్‌లో జరిగిన అసోసియేషన్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేసీఆర్ కృషితోనే తాండల అభివృద్ధి

- మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- గిరిజన బంధు తప్పకుండా వస్తది.
- రాష్ట్ర మంత్రి హరీష్‌రావు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కేసీఆర్‌కు ముందు తాండల పరిస్థితి ఏంది. ఇప్పుడు ఏంది.. ఆనాడు తాగునీళ్ల కోసం ఎంత కష్టపడ్డారో చూడండి. నారాయణఖేడ్‌లో బిందెలతో గిరిజనులు ఎన్నో పోరాటాలు చేశారు. ఆనాడు మంచం ఎక్కిన తండా.. విష జ్వరాలతో గిరిజన గూడాలు అని పేపర్లలో హెడ్డింగ్‌లు.. ఇవాళ తాగునీటి కష్టాలు లేవని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు తెలిపారు. శనివారం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా తూంకుంట పుష్ప కన్వెన్షన్‌లో రాష్ట్రస్థాయి గిరిజనుల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సమ్మేళనానికి మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన తరువాత సీఎం కేసీఆర్ అన్ని తాండలను గ్రామ పంచాయతీలు చేశారన్నారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చింది కేసీఆరే.. పట్టాలు ఒక్కటే కాదు రైతు బంధు ఇచ్చింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ప్రతి గిరిజన బిడ్డ చదువుకోవాలని గిరిజన గురుకుల పాఠశాలు ఏర్పాటు చేసింది. విదేశీ విద్య పథకం పెట్టి ఎంతో మంది గిరిజన బిడ్డలకు విదేశీ విద్యను అందించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా సీఎం కేసీఆర్ తాండలను గ్రామపంచాయతీలు చేశారని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎంపీ ప్రొ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే సత్తన్న, రాష్ట్ర గిరిజన నాయకులు రామచంద్రునాయక్, సూరయ్య, కృష్ణప్రసాద్, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఓయూలో రంగవల్లి వర్ధంతి

లాలాపేట: పీడీఎస్‌యూ విజృంభణ ఆధ్వర్యంలో శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట రంగవల్లి 24 వర్ధంతి నిర్వహించి రంగవల్లి చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అల్లూరి విజయ్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు రాకేష్, వెన్నెల, సందీప్, రాంబాబు, మానస, గీత, సాయి విద్య, రమ్య, అవంతి పాల్గొన్నారు.



అల్లాపూర్ డివిజన్ పద్మావతినగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బండి రమేష్ సతీమణి లకుమాదేవి తదితరులు



అల్లాపూర్ డివిజన్ పద్మావతి నగర్‌లో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి బండి రమేష్, సత్యం శ్రీరంగం

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ శనివారం జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి హస్తం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఫతేనగర్ డివిజన్ ప్రభాకర్‌రెడ్డినగర్ జింకలవాడకు చెందిన బీజేపీ నాయకులు అబ్దుల్ బాకీ తన 100మంది అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా బండి రమేష్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పారు.

- ఈ సందర్భంగా పార్టీలో చేరిన అబ్దుల్ బాకీ మాట్లాడుతూ.. మైనార్టీలకు కేసీఆర్ ఏమి చేయలేదన్నారు. తమకు 12శాతం రిజర్వేషన్ ఇస్తామన్న మాట తప్పారన్నారు. ఇమాములకు, మసీద్‌లకు ఎలాంటి పథకాలను అమలు చేయలదని, మైనార్టీలను పట్టించుకోవడం లేదన్నారు.కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులమై స్వచ్ఛందంగా పార్టీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జ్ డా. సత్యం శ్రీరంగం, మహిళా నాయకురాళ్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
- పతికి మద్దతుగా సతి ప్రచారం..

అల్లాపూర్ డివిజన్ పద్మావతినగర్‌లో శనివారం బండి రమేష్ సతీమణి లకుమాదేవి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. గతంలో పీజేఆర్‌లాగా బండి రమేష్ కూడా ప్రజల మధ్య ఉండి సేవ చేస్తారన్నారు. కూకట్‌పల్లి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.